క్లుప్తంగా

విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీ



విద్యార్థులకు ఉచితంగా కళ్లజోళ్లను పంపిణీ చేస్తున్న వైద్యాధికారులు

భీమవరం: జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని గునుపూడిలో ఉమా సోమేశ్వర మున్సిపల్ హైస్కూల్‌లో ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ జి.గీతాబాయి మాట్లాడుతూ దృష్టి లోపం ఉన్న 40 మంది విద్యార్థులకు కళ్లజోళ్లు ఉచితంగా పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం యు.రమేష్, గొల్లవానితిప్ప పీహెచ్‌సీ నేత్ర వైద్యుడు బి.రామకృష్ణ, డాక్టర్ భావన, డాక్టర్ గులాబిరాజు, ఎంఆర్‌కే రాజు, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ పరిశీలన



పీహెచ్‌సీని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారిణి గీతాబాయి

ఉండి: జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ జి.గీతాబాయి ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం ఉండి పీహెచ్‌సీకి విచ్చేసిన ఆమె రోగులకు అందించే వైద్య సేవలు, గదులు, మరుగుదొడ్లను ఆమె పరిశీలించారు. సిబ్బంది పని తీరు, రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై వైద్యాధికారులను ఆరా తీశారు. ఎక్కడా ఇబ్బందులు రాకుండా పీహెచ్‌సి పరిధిలోని అన్ని గ్రామాల్లో వైద్య సహాయం అందుతూనే ఉండాలని అధికారులకు, సిబ్బందికి ఆమె సూచించారు. అదే సమయంలో ఆరోగ్యశ్రీ జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ కీర్తి పీహెచ్‌సీలోనే ఉండడంతో జిల్లాలో రోగులకు అందుతున్న ఆరోగ్యశ్రీ వైద్య సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ బి.సాయిచంద్ర, డాక్టర్ పీఎల్ సునంద, సీహెచ్‌ఓ ఆర్.కృష్ణకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



పి.సుధీర్‌బాబు



ఎం.ప్రమీలారాణి

భీమవరం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పశు సంవర్ధకశాఖ ఆఫీసర్స్ సర్వీస్ అసోసియేషన్ ఎన్నికలు ఇటీవల నిర్వహించారు. ఈ ఎన్నికల్లో భీమవరం ఏరియా పశు వైద్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.సుధీర్‌బాబు జనరల్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. అలాగే పెనుగొండ ప్రాంతీయ వైద్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రమీలారాణి జాయింట్ డైరెక్టర్‌గా ఎన్నికయ్యారు. వీరిని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ, తదితరులు అభినందించారు.

ముగిసిన కల్యాణ మహోత్సవాలు



అన్నసమారాధన నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

కాళ్ల: మండలంలోని బొండాడ గ్రామంలో వేంచేసియున్న శ్రీపార్వతి సమేత భోగేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి సమేత జనార్ధన స్వామి వార్ల కల్యాణ మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. దీనిలో భాగంగా స్వామి, అమ్మవార్లకు భారీ నైవేద్యం సమర్పించిన అనంతరం సుమారు నాలుగు వేల మందికి భక్తులు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి సంఘం అధ్యక్షుడు మందపాటి కృష్ణమూర్తి మాట్లాడుతూ మార్చి 27వ తేదీన ప్రారంభమైన వార్షిక కల్యాణ మహోత్సవాలు దేవస్థానం ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించామన్నారు. ప్రతి రోజూ ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఆలయాల చైర్మన్లు కోట వెంకటరామ సూర్యనారాయణ, మందపాటి రాము, గొర్ల లక్ష్మణ్, మేకా వెంకన్నబాబు, గుడిగుంట్ల ఫణీంద్ర, ఈఓ ఆంజనేయరాజు, దేవస్థానం పాలక మండలి సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మట్టి అక్రమ రవాణా వాహనాల స్వాధీనం

ఉండి: మండలం అర్తమూరులో అక్రమంగా మట్టి తరలిస్తున్నారనే సమాచారంతో తహసీల్దార్ నాగార్జున ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు మంగళవారం దాడి చేశారు. ఈ దాడిలో మట్టి రవాణా చేస్తున్న టిప్పర్, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో పలువురు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

చివరిలో నీటి ఎద్దడి అవస్థలు



చెరుకువాడ అర్తమూరు మధ్య ప్రాంతంలో మురుగునీరు తోడుకుంటున్న రైతులు



మహదేటపట్నంలో పసర్ల నీరు తోడుకుంటున్న రైతులు

- నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్న రైతులు
- శివారు ప్రాంతాలకు ఏటా తప్పని తిప్పలు

ఉండి: నియోజకవర్గంలోని శివారు ప్రాంతాల రైతులకు సాగునీటి ఇక్కట్లు తప్పడం లేదు. ప్రతి ఏటా ఆయా గ్రామాల రైతులు సాగునీటి కోసం ధర్నాలు, నిరసనలు చేపట్టాల్సిందే అన్నట్లు ఉంది ఇరిగేషన్ వ్యవస్థ. ప్రస్తుతం నియోజకవర్గంలో వంతులవారీ విధానంలో సాగునీరు అందజేస్తున్నారు. అయితే ఆ వంతుల వారీ విధానంలో కూడా రైతులకు సాగునీరు అందకపోతే పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వరి పొలాలకు నీరు పెట్టుకుందామని ఎదురు చూస్తున్న రైతులకు ఎండమావి ఎదురవుతుంది. ముఖ్యంగా శివారు ప్రాంతాల రైతులకు ఇక్కట్లు తప్పడంలేదు. ఈ ఏడాదికూడా అదే పరిస్థితి తలెత్తడంతో చేసేది లేక రైతులు సొంత ఖర్చులతో ఇంజన్లు ఏర్పాటు చేసుకుని వరి పొలాలు, ఆక్వా చెరువులకు అందుబాటులో ఉండే మురుగు నీరు, పసర్లబారిన నీటినే తోడుకుంటున్నారు. ఈ నీటితో ఏ విధంగా పంటలు పండిస్తారని రైతులు అడిగితే ఏం చెయ్యమంటారని ఇరిగేషన్ అధికారులు అంటున్నారని వాపోతున్నారు.

కాలువల ఆక్రమణ

పంట కాలువలు, బోదెలను పలువురు స్వార్థపరులు, ఆక్వా రైతులు ఆక్రమించుకోవడంతో సాగునీటికి తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సాధారణంగా పారే నీటి ప్రవాహం ఆక్రమణల వలన ఎక్కడికక్కడే నిలిచిపోతుంది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఆక్వా రైతులు వారి చెరువుల పరిధిలో పంట బోదెలను, పంట కాలువలను పూడ్చి వేసి చిన్న చిన్న తూరలు ఏర్పాటు చేసి నీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకాలు కలిగిస్తున్నారు. ఈ విషయం సంబంధిత ఇరిగేషన్, మత్స్యశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా కన్నెత్తి కూడా చూడకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా కనిపిస్తుంది. మరికొన్ని ప్రాంతాల్లో పంట బోదెలను పూర్తి స్థాయిలో ఆక్రమించి లేఅవుట్లు, దుకాణాలు, ప్రహరీ గోడలు నిర్మించడంతో సాగునీటి సమస్య మరింత జఠిలంగా మారింది.

క్షేత్ర స్థాయి పరిశీలన లేదు

ప్రస్తుతం వంతులవారీ విధానంలో సాగునీరు సరఫరా అవుతున్న దృష్ట్యా అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి నీరు అందుతున్నదీ లేనిది గమనించాలి. కానీ ఏ గ్రామంలో రైతులు ఆందోళన చేస్తే ఆ గ్రామానికి వెళ్లడం లేదా కార్యాలయానికే పరిమితం కావడం చేస్తున్నారు. అదే విధంగా సాగు నీటి కమిటీల నాయకులు కూడా కంటి తుడుపుగా పరిశీలనలు చేసి వెళుతున్నారు తప్ప వాటివల్ల ఒరిగిందేమీ లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. అయితే త్వరలోనే వరి కోతలు కోయాల్సిన పరిస్థితుల్లో రైతులకు సాగునీటి ఇక్కట్లు తలెత్తడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

నియోజకవర్గంలో సాగునీటి ఎద్దడి ప్రాంతాలు

ఉండి మండలంలో చెరుకువాడ, అర్తమూరు, ఉండి, పాములపర్రు శివారు ప్రాతాలు. ఆకివీడు మండలంలో చినమిల్లిపాడు గ్రామంలోని శివారు ప్రాతాలు. కాళ్ల మండలంలోని ఏలూరుపాడు, కాళ్లలంక శివారు ప్రాతాలు. పాలకోడేరు మండలంలో మైప, కోరుకొల్లు, గరగపర్రు గ్రామాలు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయి.

సాగునీరు అందించాలి



రైతులు ఇబ్బందులు పడుతుంటే అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదు. రైతులకు సాగునీరు అందించాల్సిన భాధ్యత అధికారులపై ఉంటుంది. రైతులు పంట పండించినా, ఆక్వాసాగు చేసినా దానికి కావలసిన నీటిని అధికారులు అందించాలి. – వర్రే పైడియ్య, పాములపర్రు

సమస్యను పరిష్కరించాలి



సరిగ్గా వరికోతలు వచ్చే సమయంలో సాగునీరు అందకపోతే రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడతారు. అంతే కాకుండా కాలువలు కట్టేసే సమయం కాబట్టి ఆక్వా రైతులకు కూడా పూర్తి స్థాయిలో నీరందించాల్సిన భాధ్యత అధికారులపైనే ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి సాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలి. – శేషాద్రి శ్రీను, ఉండి

కుల మతాలకు అతీతంగానే సేవలు



మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావు

ఆకివీడు: సామాజిక స్పృహతో కుల మతాలకతీతంగా సేవలందించడం వల్లే వారు గొప్ప వ్యక్తులుగా చరిత్రలో నిలిచిపోతారని ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావు అన్నారు. స్థానిక మాదివాడ సెంటర్‌లోని వంగవీటి మోహనరంగారావు విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం రాధా రంగా మిత్ర మండలి ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ చలివేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గంగాధరరావు మాట్లాడుతూ రాధా రంగా మిత్ర మండలి గత 15 ఏళ్లుగా ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి మే నెలాఖరు వరకూ ఉచిత మజ్జిగ చలివేంద్రాన్ని కొనసాగిస్తున్నారనన్నారు. దాతల సహకారంతో మిత్రమండలి సభ్యులు పూర్తి సేవలందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మెప్మా మాజీ అధ్యక్షురాలు మోరా జ్యోతిరెడ్డి, మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షురాలు గాలి సామ్రాజ్యం, కౌన్సిలర్ గేదల అప్పారావు, నిమ్మల ద్వారకా, కుంకట్ల దానయ్య, సత్యనారాయణ, ఎస్కే. హుస్సేన్, డీవీ. రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఆకివీడు: స్థానిక గాలీబ్ చెరువు గట్టు వద్ద పేకాటపై దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసినట్ల ఎస్సై హనుమంతు నాగరాజు మంగళవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.13,150 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.

ఏపీటీఏ స్కాలర్‌షిప్‌ల పంపిణీ



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేస్తున్న డీసీసీబీ మాజీ చైర్మన్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్

భీమవరం: విద్యాభివృద్ధికి అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్యాల వెంకటేశ్వరరావు (రత్నం) అన్నారు. సోమవారం భీమవరం పట్టణంలోని డాక్టర్ సీఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (ఏపీటీఏ)కు చెందిన స్టూడెంట్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఏపీటీఏను సమర్ధవంతంగా నడుపుతున్న అధ్యక్ష, కార్యదర్శులు మధు వల్లు, వి.అనిల్ కుమార్, మాజీ అధ్యక్షుడు ముద్రగళ్ల త్రినాథ్ అభినందనీయులన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చీడే సత్యనారాయణ మాట్లాడుతూ స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రిన్సిపల్ సకుమల్ల సత్యనారాయణ మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన 13 మంది విద్యార్థులకు సుమారు రూ.2.56 లక్షలు ఏపీటీఏ అందించిందన్నారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రెటరీ డాక్టర్ చీడే సత్యనారాయణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎండీ సలీంఖాన్, స్కూల్ ప్రిన్సిపల్ ఎం.నిర్మల, కళాశాల హెచ్‌వోడీలు బొమ్మదేవర ప్రభాకర్, శ్రావణి, టీఎస్ఎస్ లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ మృతి కేసు సీబీఐకి అప్పగించాలి



ఆర్ఐ కార్తీక్‌కు వినతిపత్రం అందిస్తున్న సుందర్‌కుమార్, తదితరులు

ఉండి: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి కేసును ప్రభుత్వం సీబీఐకి అప్పగించాలని దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఉండి తహసీల్దార్ కార్యాలయం వద్ద దళిత ఐక్య వేదిక మండల శాఖ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి ఆర్ఐ కార్తీక్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం సుందర్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల రాజమండ్రి కొంతమూరు, దివాన్‌చెరువు మధ్య ప్రాంతంలో మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ కేసు నీరుగార్చకుండా తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆనంద్‌కుమార్, గొల్లా రాజ్‌కుమార్, పాతపర్తి సాగర్, బి.ప్రకాష్, ఎస్.మహేష్, సీహెచ్ దానియేలు, పి.రాజ్‌కుమార్, నక్కా మోజెస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ‘పది’ పరీక్షలు



పరీక్షా కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

ఉండి: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారంతో ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో ఉండి ఏబీ సెంటర్లతో పాటు ఎన్నార్పీ అగ్రహారం, ఉప్పులూరు, యండగండి సెంటర్లలో పరీక్షలు నిర్వహించగా వాటిలో వ్యాప్తంగా 602 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. మంగళవారం జరిగిన సోషల్ పరీక్షకు 16 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 14 మంది కాగా కంపార్ట్‌మెంటల్ విద్యార్థులు ఇద్దరు ఉన్నారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పరీక్షలన్నీ ప్రశాంతంగా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

20 మంది విద్యార్థులు గైర్హాజరు

పాలకోడేరు: మండలంలో మంగళవారం నిర్వహించిన పదో తరగతి సోషల్ పరీక్షకు 20 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని మండల విద్యాశాఖ అధికారి పెన్మత్స వెంకట శివనాగరాజు తెలిపారు. మండల వ్యాప్తంగా 605 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 585 మంది విద్యార్థులు హాజరై 20 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు.

14 మంది గైర్హాజరు

కాళ్ల: మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మంగళవారం నిర్వహించిన సాంఘికశాస్త్రం పరీక్షకు 14మంది గైర్హాజరయ్యారు. మండలంలో మొత్తం 723 మంది హాజరుకావాల్సి ఉండగా 709 మంది హాజరయ్యారన్నారు. మండలంలో 98.06 శాతం హాజరు నమోదైనట్లు మండల విద్యాశాఖాధికారి ఎ.రవీంద్ర వివరించారు.

రుణ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు



ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

వీరవాసరం: మండల ప్రజా పరిషత్ వీరవాసరంలో మంగళవారం నిర్వహించిన ఓబీఎంఎంఎస్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ స్కీమ్ నిమిత్తం రుణ దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. షెడ్యూల్ ప్రకారం అండలూరు, నవుడూరు పంచాయతీలకు సంబంధించిన దరఖాస్తుదారులు హాజరయ్యారు. ఎంపీపీ వీరవల్లి దుర్గా భవాని, ఎంపీడీఓ బి.అప్పారావు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నవుడూరు బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 70 దరఖాస్తుదారులకుగాను అండలూరు 44 అప్లికేషన్స్‌లో 32 మంది నవుడూరులో 45 అప్లికేషన్స్ 38 మంది హాజరయ్యారని ఎంపీడీఓ అప్పారావు తెలిపారు.

నేటి నుంచి ఇంటర్వ్యూలు

పాలకోడేరు: స్వయం ఉపాధి సోపాన పథకం కింద రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 2, 3 తేదీల్లో బుధ, గురు వారాల్లో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీవో రెడ్డియ్య తెలిపారు. 2వ తేది ఉదయం 11 గంటలకు విస్సాకోడేరు అభ్యర్థులకు, 3 తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు వేండ్ర, వేండ్ర అగ్రహారం గ్రామాల్లోని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీవో తెలిపారు.

సామాజిక పింఛన్లు సద్వినియోగం చేసుకోవాలి



గొల్లలకోడేరులో సామాజిక పింఛన్లు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

పాలకోడేరు: ప్రభుత్వం అందిస్తున్న సామాజిక పెన్షన్లు, ప్రభుత్వం కల్పిస్తున అవకాశాలతో మెరుగైన జీవనాన్ని కొనసాగించాలని మహిళా శిశు సంక్షేమం, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖల ప్రభుత్వ కార్యదర్శి, పశ్చిమ గోదావరి జిల్లా ప్రత్యేక అధికారి ఎ.సూర్యకుమారి అన్నారు. మంగళవారం పాలకోడేరు, గొల్లలకోడేరు గ్రామాల్లో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా ప్రత్యేక అధికారి ఎ.సూర్యకుమారి, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్వయంగా పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లను అందజేశారు. ట్రాన్స్‌జెండర్‌కు పెన్షన్ అందజేస్తున్న సందర్భంలో సామాజిక పింఛను సద్వినియోగం చేసుకొని, అదనపు ఆదాయంగా సంఘంలో యాచక వృత్తిని ఇక మీదట కొనసాగించొద్దని సున్నితంగా మందలించారు. కిడ్నీ వ్యాధితో డయాలసిస్ చేయించుకుంటున్న మహిళతో ఆరోగ్య విషయమై ఆరా తీశారు. అనంతరం పాలకోడేరు మండలం గొల్లలకోడేరు గ్రామంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సందర్భంలో మహిళలతో మాట్లాడుతూ పింఛన్ల మొత్తాన్ని ఎలా సద్వినియోగం చేసుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో ఏప్రిల్ 1న పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం రూ.96.87 కోట్లు విడుదల చేసిందని, వీటిని 2,25,718 మంది లబ్ధిదారులకు అందజేశామన్నారు. పింఛన్ల పంపిణీలో అవినీతికి ఆస్కారం లేకుండా సకాలంలో పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, డీఆర్‌డీఏ ఏపీవో మురళీకృష్ణ, కమ్మిలి రాంబాబు, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలను ప్రోత్సహించాలి

భీమవరం: చేనేత వస్త్రాలు మన్నిక, నాణ్యతలో మేటిగా ఉంటాయని ఆరోగ్యవంతమైన చేనేత వస్త్రాలను ప్రోత్సహించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మంగళవారం భీమవరం ఆనంద ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకాలను నాగరాణి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ నెల 6వ తేది వరకు కొనసాగే ప్రదర్శనలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు పలు రాష్ట్రాలకు చెందిన 60 స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ నాగరాణి వివరించారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, చేనేత జౌళిశాఖ జాయింట్ డైరెక్టర్ కె.కన్నబాబు, జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి కె.అప్పారావు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను పెంపును విరమించుకోవాలి

భీమవరం: ఆస్తి పన్ను పెంపును ప్రభుత్వం విరమించుకోవాలని సీపీఐ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు డిమాండ్ చేశారు. మంగళవారం భీమవరంలో ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. అద్దె విలువలపై ఆస్తి పన్ను మదింపు చేసే విధానాన్ని మారుస్తూ ఆస్తి కేపిటల్ విలువపై మదింపు చేస్తూ ఆస్తి పన్నును ఏటా 15 శాతం పెంచడాన్ని అడ్డుకుంటామని రంగారావు హెచ్చరించారు. ఈ విధానం అమల్లోకి వస్తే ఇంటి యజమానులు పన్ను కట్టడానికి ఆస్తులు అమ్ముకోవాల్సిందేనని, విపరీతంగా అద్దెలు పెరిగి సామాన్య, మధ్య తరగతి ప్రజలపై పెను భారంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విధానంపై గతంలో విమర్శలు గుప్పించిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక అదే విధానంతో ముందుకెళ్లడం దారుణమన్నారు. ఏప్రిల్ నుంచి పెంపుదల చేయాలనుకొనే ఆస్తి పన్ను ఆలోచనను విరమించుకోకపోతే వీధి పోరాటాలకు దిగుతామని రంగారావు హెచ్చరించారు.


ధాన్యం కొనుగోలుకు ప్రత్యేక చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి

భీమవరం: రబీ ధాన్యం కొనుగోలుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కొనుగోళ్లలో రైతుకు లాభం చేకూర్చేలా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో టి.రాహుల్ కుమార్‌రెడ్డి ధాన్యం సేకరణ కమిటీ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లాలో రబీ 2024–25 సీజన్‌కుగానూ రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేయుటకు 348 రైతుసేవా కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. ఈ రబీ సీజనులో కనీస మద్దతు ధర క్వింటాల్ ధాన్యానికి సాధారణ రకం రూ.2,300 చొప్పున, గ్రేడ్-ఏ రకానికి రూ.2,320గా నిర్ణయించారన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి, జిల్లా, డివిజన్, మండల, గ్రామ స్థాయి కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. దీనిలో భాగంగానే రైతులకు పూర్తి అవగాహన కలిగించే క్రమంలో గ్రామాల, మండలాల వారీగా జిల్లా మొత్తం క్షేత్ర స్థాయిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించామని తెలిపారు. రైతు సేవా కేంద్రాల వద్ద పని చేయుటకు గ్రామ వ్యవసాయ సహాయకులు, సాంకేతిక సహాయకులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లను, రైస్ మిల్లుల వద్ద భద్రతా అధికారులను ఏర్పాటు చేశామన్నారు. ధాన్యం సేకరణకు కావలసిన గోనె సంచులు, హమాలీలు, రవాణా సౌకర్యాలన్నీ కూడా ఏర్పాటు చేసి రైతులకు ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా సకాలంలో సక్రమమైన అత్యుత్తమ సేవలు అందించుటకు చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల మేనేజర్ టి.శివరామ ప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా పౌర సరఫరాల అధికారి ఎస్.సరోజ, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ వృత్తికే



పదవీ విరమణ చేసిన వారిని సత్కరిస్తున్న ఎస్పీ

భీమవరం: పోలీసుల పదవీ విరమణ కేవలం వృత్తికే తప్పా వ్యక్తిత్వానికి కాదని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. ఎస్పీ మాట్లాడుతూ సుదీర్ఘ కాలం విధి నిర్వహణలో ఎన్నో ఒడిదుడుకులు, కఠిన పరిస్థితులను ఎదుర్కొని ఉద్యోగ బాధ్యతలను విజయవంతంగా ముగించడం అభినందనీయమన్నారు. పోలీసు డిపార్ట్‌మెంట్‌లో పని చేసి పదవీ విరమణ పొందిన డీసీఆర్‌బీ ఎస్సై పి.శ్రీనివాసరావు, నరసాపురం టౌన్ పోలీస్ స్టేషన్ ఏఎస్సై ఎ.వెంకటేశ్వరరావు, యలమంచిలి ఏఎస్సై కేవీఎస్‌యూ భాస్కరరావులను మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకట్రావు, పోలీసు అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహెచ్ మోజేష్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకంతో అనారోగ్యం

భీమవరం(ప్రకాశంచౌక్): ప్లాస్టిక్ వాడకం అనారోగ్యమని ఒంటెద్దు బళ్ల, తోపుడు బండ్ల సంఘం సభ్యులు శ్రీనివాసరావు, రుద్రాక్షుల మావుళ్లయ్య, సన్యాసిరావు అన్నారు. భీమవరం నాచువారి సెంటర్‌లో మంగళవారం భీమవరం పురపాలక సంఘం, విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఒంటెద్దు బళ్ల, తోపుడు బండ్ల సంఘం సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.